# పని రోజునా.. సచివాలయానికి మూత..!

## రోజంతా తెరుచుకోని బుర్నాకుంట సచివాలయం

గురువారం నాడు సిబ్బంది ఎవరూ లేకపోవడంతో తెరుచుకోని బుర్నాకుంట సచివాలయం

**ప్రజాశక్తి-పెద్దవడుగూరు**

గురువారం నాడు ప్రభుత్వ సెలవుదినం కాదు. జిల్లా వ్యాప్తంగా అన్ని కార్యాలయాలు యథావిధిగా పనిచేశాయి. అయితే పెద్దవడుగూరు మండలం బుర్నాకుంట గ్రామ సచివాలయం మాత్రం మూతబడింది. సిబ్బంది మొత్తం కార్యాలయాన్ని మూసివేసి ఎటో వెళ్ళిపోయారు. వారంతా సెలవుపై వెళ్ళారా.. లేక అధికారిక పనులపై బయటకు వెళ్లారా అనే సమాచారం ఇచ్చేవారు ఒక్కరూ కూడా కార్యాలయంలో లేకపోవడం గమనార్హం. ఎందుకు కార్యాలయాన్ని మూతవేశారు అని తెలిపే నోటీస్ బోర్డు కూడా ఏర్పాటు చేయలేదు. నిబంధనల మేరకు కార్యాలయం మూత వేస్తే ఏ కారణంగా మూత వేశారు అనే విషయాన్ని తెలియజేస్తూ నోటీస్ బోర్డులో ప్రదర్శించాలి. ఇలా తెలియజేసేలా ఎలాంటి పేపర్‌ను అక్కడ అతికించలేదు. వివిధ పనుల మీద కార్యాలయాన్ని సందర్శించే ప్రజలు అక్కడికి వచ్చి మూసిన కార్యాలయాన్ని చూసి వెనక్కు వెళ్లిపోయారు. ఆలస్యంగా కార్యాలయానికి వస్తారేమో చూద్దాం అనే అనుమానంతో ఒకటికి రెండు సార్లు కార్యాలయంకు వచ్చి చూసినా తలుపులకు వేసిన తాళాలే గ్రామస్తులకు కన్పించాయి.

సచివాలయం తనిఖీ చేసి అక్కడి లోటు పాట్లను సరిదిద్ది, ఉద్యోగులను సరైన దారిలో పెట్టాల్సిన ఎంపిడిఒ ఇటీవలి కాలంలో విధుల నుంచి సస్పెన్షన్‌కు గురయ్యారు. ఆయన స్థానంలో ఉన్నతాధికారులు మరొకరిని ఇంతవరకు నియమించలేదు. దీంతో మండలంలో కొన్ని సచివాలయాల పనితీరు ఆడింది ఆట.. పాడింది పాట అన్నట్లుగా తయారైంది. బుర్నాకుంట సచివాలయంలో గురువారం నాడు మూసివేతే ఇందుకు నిదర్శనం. ఉన్నతాధికారులు దీనిపై స్పందించి విధులకు నిర్లక్ష్యంగా వ్యస్తున్న సచివాలయ సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.బుర్నాకుంట గ్రామ సచివాలయం మూతపడిన విషయంపై ప్రజాశక్తి ఇఒఆర్‌డిని ఫోన్ ద్వారా వివరణ కోరగా సిబ్బంది మొత్తం క్షేత్ర సందర్శనకు వెళ్లి ఉంటారని సమర్థించుకునే ప్రయత్నం చేశారు. సిబ్బంది అందరూ క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్తే నోటీస్ బోర్డుపై సమాచారం ఉండాలి.. లేదా సమాచారం ఇచ్చేందుకు ఒక్కరైనా కార్యాలయంలో ఉండాలి అన్నదానికి కూడా అధికారి నుంచి స్పష్టమైన సమాధానం రాలేదు.

# పల్లెలకు బెల్ట్ కిక్కు..!

**గత ప్రభుత్వ హయాంలో మద్యం అమ్మకాలను ప్రభుత్వమే నిర్వహించేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ పద్ధతికి స్వస్తి చెప్పి ప్రయివేటు వ్యక్తులకు టెండర్ల ద్వారా షాపులను అప్పగించింది. టెండర్ల ద్వారా షాపులను దక్కించుకున్న వ్యాపారులు వారు పెట్టిన మొత్తాన్ని వీలైనంత త్వరగా రాబట్టేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. అందులో భాగంగానే గ్రామాల్లో బెల్టుషాపులకు తెరతీశారు. షాపులు దక్కించుకున్న తర్వాత అనుకున్న స్థాయిలో వ్యాపారాలు లేవన్న సాకుతో బెల్టుదారి పట్టారు. షాపులు దక్కించుకున్న వారు ఎక్కువ మంది కూటమి నాయకులే కావడంతో అధికారాన్ని అడ్డుపెట్టుకుని బెల్టుతో గ్రామాల్లో మద్యాన్ని ఏరులై పారిస్తున్నారు.**

- ◆ గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు
- ◆ ఓ వైపు లేదంటూనే అమ్మకాలు
- ◆ నిర్వాహకులకు అధికార పార్టీ అండ

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

టెండర్ల ద్వారా మద్యం షాపులను దక్కించుకున్న వారు ఇప్పటికే మద్యం షాపులను ప్రారంభించారు. ప్రారంభంలో కొన్ని షాపులకు కొంత అధికార పార్టీ నేతల నుంచి అడ్డంకులు వచ్చినా, ప్రస్తుతం అన్ని సద్దుమణిగాయి. ఉమ్మడి జిల్లాలో దాదాపు అన్ని మద్యం షాపులూ ఇప్పటికే ప్రారంభం అయ్యి అమ్మకాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం కొనసాగుతున్న మద్యం పాలసీ ప్రకారం ముందుగా చెప్పిన దాని కంటే కమీషన్ గణనీయంగా తగ్గించారనే అభిప్రాయాలు విన్పిస్తున్నాయి. రోజువారీగా జరిగిన వ్యాపారంలో 20 శాతం కమీషన్ భావించగా ఇది అమలు జరగనట్లు తెలుస్తోంది. దీనికి తోడు వ్యాపారాలు కూడా గతంలాగా జరగలేదనే భావన వ్యాపారుల నుంచి విన్పిస్తోంది. షాపు దక్కించుకున్న ప్రతి ఒక్కరూ ఏడాదికి గ్రామీణ ప్రాంతాల్లో రూ.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.60 లక్షలు వరకు చెల్లించాలి. వీటికి అదనంగా ఇతర ఖర్చులూ ఉంటాయి. షాపులు దక్కించుకున్న వారు రూ.60 లక్షలు తీరిన తర్వాతనే లాభాల్లోకి వస్తారు. అంటే ప్రతి రోజు సరాసరి రెండు లక్షల రూపాయలకు తగ్గకుండా వ్యాపారం జరిగితేనే వారు లాభాల్లోకి వచ్చే అవకాశం ఉంది.

**బెల్టుషాపుల ఏర్పాటు**

పెద్ద మొత్తంలో డబ్బులు ఆర్జించాలని భావిస్తున్న మద్యం వ్యాపారులు బెల్టుషాపులకు తెరతీశారు. వారి పరిధిలో బెల్టుషాపులను ప్రోత్సహించి గ్రామాల్లో మద్యం అమ్మకాలకు తెరలేపారు. ఇప్పటికే చాలా గ్రామాల్లో అనధికారంగా బెల్టుషాపులు ఏర్పాటై అమ్మకాలు కూడా జరుగుతున్నాయి. బెల్టుషాపులు నిర్వహిస్తే మద్యం అమ్మకాలు పెరిగి రోజుకు వారు అనుకున్న మేరకు రూ.2 లక్షల వ్యాపారం జరుగుతుందనే భావన వ్యాపారుల్లో ఉంది. ఇప్పటికే కొందరు బెల్టు ప్రారంభించి అమ్మకాలు చేస్తుండగా మరికొందరు ఎక్సైజ్, పోలీసులు, అధికార పార్టీ నాయకులతో మాట్లాడి పల్లెల్లో ఈ షాపులను ఏర్పాటు చేస్తున్నారు.

**అధికార పార్టీ కన్నుసన్నల్లోనే..**

గ్రామాల్లో బెల్టుషాపుల నిర్వహణకు సంబంధించిన వ్యవహారం అంతా ఆయా నియోజకవర్గాల్లోని అధికార పార్టీ నేతల కన్నుసన్నల్లోనే నడుస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్య నేతలు ఎవరి పేరుత చెబితే వారే ఆ గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహించేలా తీర్మానాలు సైతం చేశారు. ఓ వైపు నేతలు, మరోవైపు

అధికారులను ప్రసన్నం చేసుకుని ఇప్పటికే పల్లె బెల్టుషాపుల నిర్వహణను ప్రారంభించేశారు. పెద్దపెద్ద పంచాయతీల్లో బెల్టుషాపుల కోసం పోటీ ఉంటే షాపుల నిర్వాహకులు ముందస్తు డిపాజిట్‌ను వేలం పాటలను నిర్వహించి షాపులను అప్పగిస్తున్నారు.

**పల్లె జీవనంపై ప్రభావం**

గ్రామాల్లో బెల్టుషాపులు ఏర్పాటు చేయడం ద్వారా పల్లె జీవనంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. రోజంతా కష్టపడి పని చేసిన సొమ్మతంతా మద్యానికే ఖర్చు చేస్తారని మహిళలు వాపోతున్నారు. ఇప్పటికే పలు గ్రామాల్లో బెల్టుషాపులకు వ్యతిరేకంగా మహిళలు తమ నిరసనను వ్యక్తం చేశారు. రెక్కల కష్టాన్ని తాగేసే బెల్టుషాపులపై వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, ఎక్సైజ్, పోలీసులు స్పందించి గ్రామాల్లో బెల్టుషాపులు లేకుండా చర్యలు తీసుకోవాలని గ్రామీణులు కోరుతున్నారు.

# 5.06 లక్షల మందికి ఉచిత గ్యాస్ సిలిండర్లు

## జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ

విలేకరులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

జిల్లాలో 5,05,831 మందికి దీపం-2 పథకం ద్వారా ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ చేస్తున్నామని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ తెలిపారు. గురువారం మధ్యాహ్నం అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలో దీపం-2 పథకం అమలుపై తీసుకుంటున్న చర్యలు గురించి పాత్రికేయుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం దీపం -2 పథకం ద్వారా అర్హత ఉన్న ప్రతి ఇంటికి సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇవ్వనున్నట్లు చెప్పారు. జిల్లాలో 5,05,831 మందికి ఉచిత గ్యాస్ సిలిండర్‌లను ప్రతి నాలుగు మాసాలకు ఒకటి చొప్పున సంవత్సరానికి మూడు సిలిండర్లు ఉచితంగా అందించనున్నట్లు చెప్పారు. మొదటి ఉచిత సిలిండర్‌కు 2025, మార్చి 31 వరకు వ్యవధి ఉన్నందున వినియోగదారులు ఎవరూ కంగారు పడాల్సిన పనిలేదని జాయింట్ కలెక్టర్ తెలిపారు. ఒకే ఇంట్లో బహుళ గ్యాస్ కనెక్షన్‌లను ఉంటే ఒక గ్యాస్ కనెక్షన్‌కే పథకం వర్తిస్తుందన్నారు. ఈ పథకం కోసం ఎక్కడా దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని గ్యాస్ కనెక్షన్, ఆధార్ అనుసంధానం అయిన వారందరికీ ఇది వర్తిస్తుందని చెప్పారు. గ్యాస్ సిలిండర్ వినియోగదారునికి అందించిన 48 గంటలలోపు రాయితీ మొత్తం వారి వారి బ్యాంకు ఖాతాకు జమవుతుందన్నారు. ఈ క్రమంలో ఎవరికైనా ఏదైనా సమస్యలు ఉత్పన్నమైతే వారు టోల్ ఫ్రీ నెంబర్ '1967' కు గాని ,గ్రామ వార్డు సచివాలయాల్లో గాని లేదా పిజిఆర్‌ఎస్ పరిష్కార వేదికలో లికానీ ఫిర్యాదు చేయవచ్చున్నారు. ప్రతి ఒక్కరూ ఈకేవైసీ తప్పనిసరిగా చేయించాలన్నారు. డిఎస్ఒ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బుధవారం సాయంత్రం వరకు 93,128 గ్యాస్ సిలిండర్ కోసం బుకింగ్ చేయగా, 55,925 మందికి గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేసినట్లు చెప్పారు. మిగిలిన వారికి త్వరలోనే పంపిణీ అవుతాయన్నారు. వివిధ స్కీమ్‌ల కింద గ్యాస్ కనెక్షన్లు మంజూరు అయిన వారు వారి కనెక్షన్లను దీపం-2 పథకం కింద లింక్ అయి ఉండాలన్నారు.

అవగాహన ర్యాలీ చేస్తున్న పిహెచ్‌సి సిబ్బంది

## క్యాన్సర్‌పై అవగాహన

**ప్రజాశక్తి-రాయదుర్గం**

క్యాన్సర్ వ్యాధిని ప్రారంభంలోనే గుర్తించి చికిత్స పొందితే ప్రాణాపాయ స్థితి నుంచి తప్పించుకోవచ్చని మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్ తెలిపారు. డి.హీరేహాల్ మండలంలోని నాగలాపురం పిహెచ్‌సి పరిధిలోని నాగలాపురం, కాదలూరు గ్రామాల్లో గురువారం క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన క్యాన్సర్ లక్షణాలు, స్క్రీనింగ్ పరీక్షలు, జాగ్రత్తలు, మందులు, ఆహారపు అలవాట్ల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎఎన్ఎం అరుంధతి, ఎంఎల్‌హెచ్‌పి లక్ష్మీ నారాయణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్రీడల్లో 3 శాతం రిజర్వేషన్ హర్షణీయం

**ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్**

కూటమి ప్రభుత్వం క్రీడల్లో కల్పించిన 3 శాతం రిజర్వేషన్‌పై పట్టణంలోని కర్ణం చిక్కప్ప స్కూల్ పిడిలు రమేష్, కుళ్లాయప్ప హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలో గురువారం వారు మాట్లాడుతూ రాష్ట్రం లో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం జాతీయ, అంతర్జాతీయ విభాగాల్లో గెలిచిన క్రీడాకారులకు ప్రైజ్ మని పెంచడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాలను క్రీడాకారులు అందిపుచ్చుకొని క్రీడల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో డిఎస్ఎ కోచ్ మద్దిలేటి, క్రికెట్ కోచ్ హరి, హాకీ కోచ్ అక్రంబాషా, ఫుట్ బాల్ కోచ్ ప్రవీణ్, క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

## వయోజన విద్యపై శిక్షణ

**ప్రజాశక్తి-బొమ్మనహాల్**

స్థానిక ఐకెపి కార్యాలయంలో గురువారం వాలంటీర్లకు వయోజన విద్యపై శిక్షణ ఇచ్చారు. ఎపిఎం రామకృష్ణ, వయోజన విద్య మండల కోఆర్డినేటర్ పరమేశ్వర మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో 50 శాతం మంది నిరక్షరాస్యులు ఉన్నారన్నారు. వారికి రాయడం, చదవడం, అంకెలను గుర్తించడం, చట్టాలు, సెల్‌ఫోన్ వినియోగం, ఆర్థిక అక్షరాస్యత, తదితర అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో ఐకెపి అనుసంధానంతో సాయంత్రం 7 నుంచి రాత్రి 9 గంటల వరకూ వయోజనులకు విద్యను బోధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్, ఐకెపి కలిసి పని చేయాల్సి ఉంటుందని, అందుకు వాలంటీర్లు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ శాంతకుమారి, ఐకెపి సిబ్బంది. వాలంటీర్లు పాల్గొన్నారు

## జాతీయ రహదారిపై గుంత

**ప్రజాశక్తి-రాయదుర్గం**

పట్టణ సమీపంలోని జాతీయ రహదారి ఎన్‌హెచ్-544 డిడిలో చెక్‌పోస్ట్ వద్ద రోడ్డుపై బుధవారం రాత్రి ఉన్నఫళంగా ఓ రంధ్రం ఏర్పడింది. గమనించిన ప్రయాణికులు ఆ రంధ్రంలో ఓ కర్ర పెట్టి జెండాను పాతారు. కాగా రోడ్డు నిర్మించి ఏడాది కూడా గడవకముందే రంధ్రం ఏర్పడటం పట్ల వాహనదారులు మండిపడుతున్నారు. వెంటనే మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

జాతీయ రహదారి పై పడిన గుంత

# సాగునీటికి బడ్జెట్లో నిధులు కేటాయించాలి : సిపిఎం

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

అనంతపురం జిల్లా వెనుకబాటుకు కారణమైన సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధికి బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని సిపిఎం నాయకులు కోరారు. ఈ మేరకు అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్‌ను సిపిఎం నాయకులు గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ మాట్లాడుతూ ఒకవైపు వర్షాలు అధికమై తుంగభద్ర డ్యామ్ ఇప్పటికే మూడుసార్లు పొంగి పొర్లుతున్నా అనంతపురం జిల్లాలో ఉన్న చెరువుల్లో చుక్క నీరు చేరలేదన్నారు. వరదలు వచ్చినప్పుడు వృథాగా పోతున్న నీరును కాలువల ద్వారా చెరువులు, కుంటలకు మళ్లిస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. హెచ్ఎల్‌సి పనులను ఆధునీకరించాలన్నారు. వీటిపై స్పందించి వచ్చే బడ్జెట్లో సాగునీటి కోసం నిధులను కేటాయించే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సాగునీటి సమస్యలన్నింటినీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అనంతపురం జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు తనవంతు కృషి చేస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.నాగేంద్ర, ఒకటవ నగర కార్యదర్శి రామిరెడ్డి, నగర నాయకులు వెంకటనారాయణ, ముర్తుజ, ఇర్ఫాన్, లక్ష్మీనారాయణ, వీరస్వామి ఎర్రిస్వామి, ఏటీఎం నాగరాజు, నాగభూషణం పాల్గొన్నారు.

## ప్రతిపాదనలు కాదు.. నిధులు ఇవ్వండి

### సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

జిల్లాలో సాగునీటి వనరుల అభివృద్ధి కోసం అధికారులు ప్రతిపాదనలకే పరిమితం కాకుండా, నిధులు రాబట్టేలా వివరాలు సిద్ధం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. పిఎబిఆర్ రిజర్వాయర్‌ను 11.10 టిఎంసిల సామర్థ్యంతో నిర్మించాలని నిర్ణయించి మూడు దశాబ్దాలు పూర్తయినా ఇప్పటికి అమలు కాకపోవడం విచారకరం కూటమి ప్రభుత్వం మరోసారి పిఎబిఆర్ ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయన్నారు. 1994లో ప్రారంభమైన ఈ రిజర్వాయర్ పూర్తి సామర్థ్యానికి తగ్గట్టుగా భూ సేకరణ ఇప్పటి వరకు జరగలేదన్నారు. ప్రభుత్వాలు మారుతున్నాయే తప్పా లక్ష్యం నెరవేరలేదన్నారు. దీనివల్ల తుంగభద్ర డ్యామ్‌లో నీరు ఉన్నప్పటికీ రిజర్వాయర్‌లో నిలువ పెట్టుకునే అవకాశం లేకుండా పోయిందన్నారు. ఈ నెలలో ప్రవేశపెడుతున్న రాష్ట్ర బడ్జెట్లో ఇందుకు అవసరమైన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. జిల్లాకు ఉన్న ఒకే ఒక నికర సాగునీటి వనరు తుంగభద్ర డ్యాం అన్నారు. అక్కడి నుంచి వస్తున్న నీటిలో కొంత భాగాన్ని పీఏబీఆర్‌లో నిలువ పెట్టి జిల్లాలోని శ్రీసత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి పథకాలకు ఉపయోగిస్తున్నారని చెప్పారు. ఈ రిజర్వాయర్‌లో 11 టీఎంసీలు నిలువ పెట్టుకోలిగితే లక్షన్నర ఎకరాలకు నీటి భద్రత కలిగే అవకాశం ఉందన్నారు. కర్ణాటక సరిహద్దు నుంచి ఆంధ్రలోకి ప్రవేశించే తుంగభద్ర నీటిని కాపాడుకునేందుకు ఉంతకల్లు దగ్గర ఒక రిజర్వాయర్ నిర్మించాలని 15 సంవత్సరాల క్రితం చేసిన ప్రతిపాదనలను కూడా ఈ బడ్జెట్లో పూర్తి చేయాలన్నారు. ఈ రెండు రిజర్వాయర్ల ద్వారా జిల్లాలో తాగు, సాగునీటి వనరులను అభివృద్ధి చేయాలని కోరారు. గత నెల 15 నుంచి 21వ తేదీ వరకు సిపిఎం ఆధ్వర్యంలో సాగునీటి వనరుల కోసం బస్సుయాత్ర, కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టామన్నారు. రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, కలెక్టర్ స్పందించి అధికారులతో సమీక్షిస్తుండడం మంచి పరిణామం అన్నారు. వారి ప్రయత్నాలు ఆచరణలో నెరవేరేటట్లు బడ్జెట్‌లో నిధుల కేటాయింపునకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని జిల్లాలోని ఎమ్మెల్యేలకు సిపిఎం తరుపున వినతిపత్రాలు అందిచామన్నారు. సాగునీటి వనరులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి పూర్తి చేయడం ద్వారా ఈ ప్రభుత్వంపై ప్రజలు పెట్టుకున్న ఆశలను నెరవేర్చాలని కోరారు.

## సిసి రోడ్డు నిర్మాణంలో మట్టి ఉపయోగిస్తారా..?

మట్టి ఉన్న ఫొటోను ఎంపీడీవోకు చూపిస్తున్న కో ఆప్షన్ సభ్యుడు దిలావర్

**ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్**

రోడ్డు నిర్మాణ పనుల్లో ఇసుక బదులు మట్టి వాడడమేంటి..? అని మండల కో ఆప్షన్ సభ్యుడు దిలావర్ మండల సర్వసభ్య సమావేశంలో పంచాయతీరాజ్ ఏఈ మునిస్వామిని నిలదీశారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం ఎంపిపి విద్యావతి అధ్యక్షతన ఎంపిడిఒ కొండన్న ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోఆప్షన్ సభ్యుడు దిలావర్ మాట్లాడుతూ 'ఏఈ గారూ.. ఓ గ్రామంలో రోడ్డు నిర్మాణం పనుల్లో ఇసుక బదులుగా మట్టిని తొలిపెట్టారు. సిమెంట్‌లో ఇసుక కలపకుండా మట్టిని ఉపయోగించడం ఎంతవరకు కరెక్ట్ చెప్పండి' అని పిఆర్ ఏఈ మునిస్వామిని ప్రశ్నించారు. అలాగే తన మొబైల్‌లో ఉన్న మట్టి ఫొటోను ఎంపిడిఒ కొండన్న, తహశీల్దార్ నాగరాజుకు చూపించారు. అయితే ఆ గ్రామం పేరు చెప్పనని అక్కడ ఓ నాయకుడు పని చేస్తున్నాడని తెలిపారు. స్పందించిన తహశీల్దార్ ఈ విషయాన్ని పరిశీలించాలని ఏఈకి సూచించారు. ప్రభుత్వ పక్కా గృహాలు నిర్మించుకుని బిల్లులు రాని వారు మా దృష్టికి తీసుకొస్తే బిల్లులు మంజూరు చేస్తామని హౌసింగ్ ఏఈ చైతన్య తెలిపారు. పశువుల గణన కోసం ఇళ్ల వద్దకు వచ్చే సిబ్బందికి సహకరించాలని పశువైద్యాధికారి నారాయణరెడ్డి కోరారు. వివిధ శాఖల అధికారులు వారి శాఖల పనితీరు, పథకాల లబ్ధి గురించి వివరించారు. ఇదిలా ఉండగా ప్రతి సమావేశంలో మాదిరిగానే ఈ సమావేశంలో మహిళా సర్పంచులు, ఎంపిటిసిల స్థానాల స్థానంలో వారి భర్తలు హాజరై ప్రశ్నలు సంధించగా అధికారులు సమాధానం ఇవ్వడం గమనార్హం. ఈ విషయంపై ఎంపిడిఒ కొండన్నను వివరణ కోరగా కొత్తగా వచ్చాను, తదుపరి సమావేశాల్లో అలా జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



ఎక్సైజ్ సిఐకి వినతిపత్రం ఇస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

## విద్యాసంస్థల వద్ద మద్యం షాపు వద్దు : ఎస్‌ఎఫ్‌ఐ

**ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్**

విద్యాసంస్థల వద్ద మద్యం షాపు ఏర్పాటు చేయవద్దని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల రోడ్డులో మద్యం దుకాణం ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని, దానిని అడ్డుకోవాలని కోరుతూ గురువారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఎక్సైజ్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం ఎక్సైజ్ సిఐకి వినతిపత్రం అందజేశారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వంశీ మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాల, కరణం చిక్కప్ప ప్రభుత్వ ఉన్నత పాఠశాల రహదారిలో మద్యం షాపు ఏర్పాటుకు అనుమతి ఇవ్వవద్దన్నారు. ఈ మార్గంలో ప్రతిరోజూ వేలాదిమంది విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారని, మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతారన్నారు. స్పందించిన సిఐ ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ధర్నాలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అచ్యుత్‌ప్రసాద్, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు అరవింద్, ఆదర్శ్, హరీష్, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# 8 నుంచి సిపిఎం 'ప్రజాపోరు'

**ప్రజాశక్తి-రాయదుర్గం**

ప్రజల సమస్యలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై చేపట్ట నున్న 'సిపిఎం ప్రజాపోరు' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బి.మల్లికార్జున పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం పట్టణంలో పార్టీ నాయకులతో కలిసి 'సిపిఎం ప్రజాపోరు' కరపత్రాలను ఆవిష్కరించారు. మల్లికార్జున మాట్లాడుతూ అధిక ధరలు, నిరుద్యోగం, డీఎస్సీ, మహిళలు, దళితులపై దాడులు, అత్యాచారాలు, జమిలి ఎన్నికలు, విశాఖ ఉక్కు ప్రయివేటీ కరణ, విద్యుత్ ఛార్జీల పెంపు, సాగునీటి వనరుల అభివృద్ధికి నిధులు, ఇసుక, మద్యం మాఫియా, స్మార్ట్ మీటర్ల, తదితర ప్రజా సమస్యలపై 'సిపిఎం ప్రజాపోరు' పేరుతో ఈ నెల 8 నుంచి 14వ తేదీ వరకూ జిల్లా వ్యాప్తంగా ఇంటింటా ప్రచార కార్యక్రమం చేపడుతామని తెలిపారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తామన్నారు. 14వ తేదీ కలెక్టరేట్, మండల కార్యాలయాల వద్ద కలిసి వచ్చే రాజకీయ పార్టీలు, ప్రజలు, విద్యార్థి, యువజన, మహిళా, ప్రజాసంఘాలతో కలిసి పెద్దఎత్తున ధర్నా చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం ప్రాంతీయ కమిటీ సభ్యులు మధు, తిమ్మరాజు, నాయకులు శివన్న, ఉచ్చప్ప, మల్లి, రామంజి, నారాయణ, నాగరాజు, ఆంజనేయులు, ప్రసాద్, రాజు, తిమ్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధికి 'మాదినేని' విరాళం

విరాళం అందిస్తున్న మాదినేని ఉమామహేశ్వర నాయుడు

**ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్**

మండల కేంద్రమైన శెట్టూరులో నూతనంగా నిర్మిస్తున్న శ్రీఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి నియోజకవర్గ వైసిపి నాయకుడు మాదినేని ఉమామహేశ్వర నాయుడు రూ. 80వేలు విరాళం అందజే శారు. ఆలయ కమిటీ సభ్యులు పట్టణంలోని ఆయన వ్యక్తిగత కార్యాలయం వెళ్లి ఆలయ నిర్మాణ పనుల పున:ప్రారంభ కార్యక్రమానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరనాయుడు ఆలయ కమిటీ సభ్యులకు రూ. 80వేలు అందజేశారు. భవిష్యత్తులో కూడా సహాయ, సహకారాలు అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో తలారి సత్తి, తిమ్మగానిపల్లి మల్లి, ఆలయ కమిటీ సభ్యులు కేశవరెడ్డి, సోమనాథ్‌రెడ్డి, బోయ తిప్పేస్వామి, హరినాథ్‌రెడ్డి, గొల్ల వెంకటేష్, ఆదిశేషు, మెడికల్ స్టోర్ విరుపాక్షిరెడ్డి, మల్లెల రామాంజనేయులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో మెరిసిన శివలింగమ్మ

**బ్రహ్మసముద్రం :** రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో స్థానిక జడ్పీ హైస్కూల్ విద్యార్థిని శివలింగమ్మ ప్రతిభ చాటిందని హెచ్ఎం చంద్రమౌళి, పిఇటి ఇబ్రహీం తెలిపారు. వారు మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థిని జి.శివలింగమ్మ ఇటీవల శ్రీకాకుళం జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో అండర్-17 విభాగంలో 4-400 రిలే టీం విభాగంలో రెండో స్థానంలో నిలిచిందన్నారు. శివలింగమ్మను హెచ్ఎం, పిఇటితో పాటు ఉపాధ్యాయ బృందం అభినందించారు. శివలింగమ్మ తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ కూతురు అథ్లెటిక్స్‌లో రాణించడం గర్వకారణంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవికుమార్, హనుమంతరెడ్డి, తిప్పేస్వామి, సుమంగళి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినితో ఉపాధ్యాయ బృందం, పిఇటి ఇబ్రహీం

# నేటి నుంచి సిపిఎం 'ప్రజాపోరు'

కరపత్రాలను విడుదల చేస్తున్న సిపిఎం నాయకులు

**ప్రజాశక్తి-గుంతకల్లు**

ప్రజా సమస్యల పరిష్కారం కోసం నేటి నుంచి 14వతేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా సిపిఎం ఆధ్వర్యంలో ప్రజాపోరు పేరుతో ఇంటింటా ప్రచార కార్యక్రమం నిర్వహించనున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.శ్రీనివాసులు తెలిపారు. గురువారం పట్టనంలోని హంపిరెడ్డి భవనంలో ఇందుకు సంబంధించిన ప్రచార కరపత్రాలను విడుదలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరిగిన అధిక ధరలు, నిరుద్యోగం, మహిళలు, పిల్లలు, దళితులపై జరుగుతున్న అత్యాచారాలను నిరోధించాలని, జమిలి ఎన్నికలు, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ వంటి అంశాలపై పోరాటాలు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్యోగాలు వస్తాయని ఎదురుచూస్తున్న యువత నిరాశ ఎదురైందన్నారు. డీఎస్సీ వాయిదా పడిందని, గ్రూప్-1, గ్రూప్-2 ఆగమ్యగోచరంగానే మారిందన్నారు. ఫలితంగా కోచింగ్ తీసుకున్న యువత అయోమయంలో పడిందన్నారు. ప్రభుత్వం వెంటనే రిక్రూట్‌మెంట్ ప్రారంభించి ఉద్యోగాలు, ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఉచిత ఇసుక విధానం నేటికీ అమల్లోకి రాకపోవడం వల్ల భవన నిర్మాణ కార్మికులు, వాహన రవాణా యజమానులు, కార్మికులు, ర్యాంపుల్లో పని చేసే కార్మికులు, నిర్మాణదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మద్యంషాపుల యజమానులు విచ్చలవిడితనం, సమయాలు పెంచడం, బెల్టుషాపులకు తెరదీయడం క్షమార్హమన్నారు. విద్యుత్ ఛార్జీలు పెంచబోమంటూనే ట్రూఅప్ ఛార్జీల పేరుతో రూ.20 వేలకోట్ల భారాన్ని ప్రజలపై కూటమి ప్రభుత్వం వేస్తోందన్నారు. ఆయా సమస్యలపై సిపిఎం చేపట్టనున్న ప్రజాపోరు యాత్రకు ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు డి.శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు మారుతీప్రసాద్, కసాపురం రమేష్, జగ్గలి రమేష్, పట్టణ కమిటీ సభ్యులు చంద్ర, సురేంద్ర, రాముసాయక్, తిమ్మప్ప, అబ్దుల్లా, ఓబులేష్ తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి విక్రేతల ముఠా అరెస్టు

## 20 కిలోలు స్వాధీనం

పట్టుబడిన గంజాయి వివరాలను వెల్లడిస్తున్న ఎఎస్పీ డివి.రమణమూర్తి

**ప్రజాశక్తి -అనంతపురం క్రైం**

గంజాయి విక్రేతల ముఠాను అనంతపురం 4వ పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను అదనపు ఎస్పీ డివి.రమణమూర్తి గురువారం స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాల్లో విలేకరులకు వెల్లడించారు. ఒడిస్సాలోని కొరపాట్ జిల్లాకు చెందిన దిలీప్ బంక, అనంతపురానికి చెందిన సాకే వినయ్ కుమార్ అలియాస్ తలకాయ, అలియాస్ విన్ని, సయ్యద్ జబ్బార్ అలియాస్ దుబ్బి, ఎం.రమేష్ అలియాస్ రమ్మి, పప్పూరు జయరాం, సురేష్ బాబు, అహ్మద్ పర్వస్, అప్పేచెర్ల మహేంద్ర అలియాస్ మహి, చెవిటి ప్రదీప్, గుంతకల్లుకు చెందిన సి.భాస్కర్‌లు ఒక ముఠాగా ఏర్పడి జిల్లాలో గంజాయి విక్రయాలు చేస్తున్నారు. వీరిలో అనంత జిల్లాలోకి గంజాయిని తీసుకురావడంలో దిలీప్ బంక కీలక నిందితుడు. ఆంధ్ర- ఒడిస్సా సరిహద్దుల్లోని గ్రామానికి చెందిన ఇతను ఆ ప్రాంతంలో పండించిన గంజాయిని తక్కువ ధరలకు కొనుగోలు చేయడం, ఆ సరుకును ఆల్టో కారులో అక్రమంగా అనంతపురానికి తరలిస్తాడు. కిలో గంజాయి రూ. 5 వేలు ప్రకారం ఈ ముఠాలోని మిగితా నిందితులకు విక్రయిస్తున్నాడు. దిలీప్ బంకతో కొనుగోలు చేసిన గంజాయిని మిగితా 10 మంది నిందితులు వేర్వేరుగా అనంతపురం పట్టణం, జిల్లాలోని మిగితా ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ ప్రత్యేక దృష్టి సారించి సరఫరాదారులు, విక్రేతలపైనే కాకుండా గంజాయి వినియోగదారులపై నిఘా ఉంచారు. ఇందులో భాగంగా రాబడిన సమాచారం మేరకు గంజాయి సరఫరా కీలక నిందితుడు ది లీప్ బంకతో పాటు మరో పది మందిని గురువారం అరెస్టు చేశారు. వారి నుంచి వీరిని అరెస్టు చేసి వారిని నుంచి 20 కిలోల గంజాయి, కారు, 2 బైకులు, 11 సెల్ ఫోన్లు, రూ.2,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి సేవించే అలవాటు ఉన్న కొందరు విద్యార్థులను గుర్తించి ఇటీవలే వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చామని, విద్యార్థుల భవిష్యత్తును దష్టిలో ఉంచుకుని మొదటి తప్పుగా హెచ్చరించి పంపామని అడిషనల్ ఎస్పీ తెలిపారు. మళ్లీ అదే పంథా కొనసాగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం డీఎస్పీ వి.శ్రీనివాసరావు, నాల్గవ పట్టణ సిఐ కనుమురి సాయినాథ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ కార్యాలయాలకు స్మార్ట్ మీటర్లు

పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన స్మార్ట్ మీటర్

**ప్రజాశక్తి-పుట్లూరు**

మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేశారు. పోలీస్‌స్టేషన్, ఐకెపి కార్యాలయం, గ్రంథాలయం, సచివాలయం, తదితర ప్రభుత్వ కార్యాలయాలకు మీటర్లు ఏర్పాటు చేశారు. కార్యాలయాలు ఏర్పాటు చేసిన అనంతరం కూడా ప్రతి ఇంటికీ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. ఇదే జరిగితే నెలానెలా రీఛార్జ్ చేసుకుంటేనే విద్యుత్ సరఫరా అయ్యే అవకాశం ఉంది. రీఛార్జ్ అయిపోతానే విద్యుత్ సరఫరా నిలిచిపోనున్నట్లు సమాచారం. ఫలితంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవాల్సి ఉంటుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ఎన్నికల హామీ లో ప్రకారం స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయకుండా ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారు.

# 9న ప్రధాని 'సూర్యఘర్' మేళా

## ఎపిఎస్‌పిడిసిఎల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ సంపత్‌కుమార్

**ప్రజాశక్తి-అనంతపురం**

నగరంలోని ట్రాన్స్‌కో ఎస్ఇ కార్యాలయ ప్రాంగణంలో ఈనెల 9న నిర్వహించనున్నట్లు ప్రధానమంత్రి సూర్యఘర్ మేళాను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీ ట్రాన్స్‌కో సూపరింటెండెంట్ ఇంజినీర్ సంపత్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఈ పథకం రాయితీతో ప్రజలు తమ ఇళ్లపై సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకునే అవకాశం ఉంటుందన్నారు. కిలోవాట్ సోలార్ నిమిత్తం ప్రభుత్వ రూ.30వేల రాయితీ ఇస్తుందన్నారు. ఇదేక్రమంలో రెండు కిలోవాట్లకు రూ.6వేలు, మూడుకిలో వాట్లకు రూ.78వేలు సబ్సిడీ రూపంలో ప్రభుత్వం అందించనున్నట్లు తెలిపారు. ఈ పథకం వల్ల గృహ వినియోగదారులకు అతి తక్కువ విద్యుత్ బిల్లు వస్తుందన్నారు. ఈ పథకానికి అర్హులు కావాలంటే ఇంటి పైకప్పుపై కనీసం 10 చదరపు మీటర్ల నుంచి వంద చదరపు అడుగుల వరకూ స్థలం ఉండాలన్నారు. ఆసక్తి ఉన్న వారు ఎపిఎస్‌పిడిసిఎల్ వెబ్‌సైట్ ద్వారా ప్రధానమంత్రి సూర్యఘర్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 9వతేదీ కార్యాలయ ప్రాంగణంలో జరిగే ఈమేళా ఉదయం నుంచి సాయంత్రం వరకూ కొనసాగుతుందన్నారు. కావున ఆసక్తి ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# నిర్లక్ష్యం వీడకపోతే.. క్షేత్రస్థాయికి వస్తా..

## మున్సిపల్ అధికారులపై ఎమ్మెల్యే దగ్గుపాటి ఫైర్

మురుగు కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

'గత ఐదేళ్లుగా ఉన్న నిర్లక్ష్యమే.. ఇప్పటికీ అధికారుల్లో కనిపిస్తోంది. నిర్లక్ష్యం వీడకపోతే నేనే క్షేత్రస్థాయిలోకి దిగి పని చేయాల్సి ఉంటుంది' అంటూ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హెచ్చరించారు. మీ ఇంటికి-మీ ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కమిషనర్ నాగరాజు, ఇతర అధికారులతో కలిసి గురువారం నగరంలోని 18వ డివిజన్‌లో ఎమ్మెల్యే పర్యటించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా డ్రెయినేజీ, వీధిలైట్లు, రోడ్ల సమస్యలను ప్రజలు విన్నవించారు. కనీసం డ్రెయినేజీలు కూడా శుభ్రం చేయలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ గతంలో 35 అడుగులకుపైగా ఉన్న రోడ్లు నేడు 20 అడుగులకు కుచించుకపోయాయన్నారు. ఇలా ఆక్రమణలు ఉంటే డ్రెయినేజీలు, రోడ్ల పరిస్థితి ఏంటని నిలదీశారు. మరోవైపు ఆర్‌కె.నగర్‌లో నెలక్రితం చిన్న కల్వర్టు నిర్మించమని చెబితే అధికారులు ఇప్పటి వరకూ పని చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు టవర్‌క్లాక్ వద్ద ఉన్న మున్సిపల్ కాంప్లెక్స్‌పై చెత్తాచెదారంపై ఎమ్మెల్యే తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరం నడిబొడ్డున ఇంత విలువైన మున్సిపల్ కాంప్లెక్స్ లో చెత్తాచెదారం, మద్యం బాటిళ్లు ఉండటం ఏంటని అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే వీటన్నిటిని శుభ్రం చేయించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గాజుల ఆదెన్న, టిడిపి రాష్ట్ర నాయకుడు గంగారాం, మాజీ కార్పొరేటర్ సరిపూటి రమణ, మాజీ కో ఆప్షన్ సభ్యులు మున్వర్, టిడిపి సీనియర్ నాయకలు మణికంఠ బాబు, మైనార్టీ నాయకుడు తాజుద్దీన్, రాయలసీమ బలిజ సంఘం యువజన అధ్యక్షుడు తొండపునాటి రమేష్, నాయకులు ముస్తాక్, హసీనా, సికిందర్, తమ్మినేని శ్రీవర్ధన్, రామ్మోహన్ చౌదరి, తలారి అంజి, సిరిశాల రాంబాబు టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# 9న ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సమావేశం

**ప్రజాశక్తి-అనంతపురం**

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై చేర్చేందుకు ఈనెల 9వ తేదీ నగరంలోని ఉపాధ్యాయ భవన్‌లో సమావేశం నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కన్వీనర్లు జూపల్లి రమణకుమార్, పి.విజయభాస్కరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అధ్యక్షులు జి.ఆస్కారం రావు, శ్రీకాంత్‌రాజు హాజరవుతారన్నారు. కావున ఉమ్మడి అనంతపురం జిల్లా నలుమూలల నుండి వివిధ విభాగాల ఉద్యోగులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# మైనింగ్ భూముల సర్వే

**పెద్దవడుగూరు :** మండలంలోని కొండుపల్లి సమీపంలో ఉన్న సర్వేనెంబర్ 699-ఎ మైనింగ్ భూములను రెవెన్యూ, భూగర్భగనుల శాఖ అధికారులు గురువారం సర్వే చేపట్టారు. చరణ్‌కుమార్, శివ అనే రైతులు గత సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇక్కడి భూములను సర్వే చేసేందుకు మండల సర్వేయర్ ప్రసాద్, భూగర్భగనుల శాఖ ఆర్వ కవిత, సర్వేయర్ ఉమాదేవి తదితరులు భూముల వద్దకు చేరుకుని సర్వేచేశారు. సర్వే చేసిన విస్తీర్ణంలో తేడాలు ఉండటంతో ఇరువర్గాలకు అధికారులు తెలియజేయడంతో జిల్లా అధికారులను ఆశ్రయిస్తామని సదరు రైతులు తెలిపినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

# పక్కాగా ఇంటింటి సర్వే

**పుట్లూరు :** మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటి సర్వేను పక్కాగా నిర్వహించాలని ఎంపిడిఒ అలివేలమ్మ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వారికి కేటాయించిన ఇళ్లకు వెళ్లి సర్వే పూర్తి చేయాలన్నారు. సర్వే చేసిన సమయంలో ఇంటి సభ్యుల ఫొటో నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# ఆచార్య ఎన్‌జి.రంగాకు నివాళి

**నార్పల :** మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో ఉన్న ఆర్డీటీ పాఠశాల ఆవరణలో సర్పంచి సాకే రామాంజనేయులు ఆధ్వర్యంలో ఆచార్య ఎన్‌జి.రంగా జయంతిని పురస్కరించుకుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రైతులకు కలుపుతీత కుర్చీ కట్లను పంపిణీ చేశారు. తర్వాత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎన్‌జి.రంగా కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ మల్లేశ్వరి, హార్టికల్చర్ శాస్త్రవేత్త త్రికాల మాధవి, హోమ్ సైన్స్ సైంటిస్ట్ సుధారాణి, ఎంపిటిసి శంకర్‌యాదవ్, హార్టికల్చర్ అసిస్టెంట్ కుపెంద్ర, కెవికె సహాయకులు సందీప్, నాగప్ప, హనుమంతు, కల్పన, ఎర్రిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోండి

**ఉరవకొండ :** ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉరవకొండ, విడపనకల్ మండలాల తహశీల్దార్లు మహబూబ్‌బాషా, సునీతాబాయి గురువారం ఒక ప్రకటనలో కోరారు. గతనెల 9న ప్రారంభమైన ఓటరు నమోదు కార్యక్రమం ఈనెల 24వతేదీ వరకూ కొనసాగుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# అదనపు బాధ్యతల నుంచి తప్పించాలని వినతి

**నార్పల :** అదనపు బాధ్యతల నుంచి తప్పించాలని కోరుతూ మండలంలోని ఎఎన్‌ఎంలు గురువారం మండల కేంద్రంలోని కార్యాలయంలో ఎంపిడిఒ గంగావతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల తమకు అదనపు విధులు అప్పగించడం వల్ల తమ ఆరోగ్య సంరక్షణ విధులను సక్రమంగా నిర్వహించలేకపోతున్నామన్నారు. జీవో 24 ప్రకారం తమను కేవలం ఆరోగ్య సేవలకు మాత్రమే వినియోగించాలని కోరారు.

# పేదలందరికీ నాణ్యమైన వైద్యం

## ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

**ప్రజాశక్తి-శింగనమల**

పేదలందరికీ నాణ్యమైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఇందులో భాగంగా వార్డుల్లో పర్యటించి రోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తర్వాత రికార్డులను పరిశీలించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కమిటీ ఛైర్‌పర్సన్‌గా ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేదల సంక్షేమం, ఆరోగ్యమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. వైద్యులో నిత్యం అందుబాటులో ఉంటూ పేదలకు వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. అనంతరం జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవలో పాల్గొని క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సాకే బ్రహ్మయ్య, ఎంపిడిఒ నిర్మలాకుమారి, పిహెచ్‌సి డాక్టర్ శంకర్‌నాయక్, మెడికల్ అధికారి పవన్‌కుమార్, అశ్వర్థనారాయణ, టిడిపి నాయకులు అమ్మలదిన్నె శాలిని, బోయ సత్యనారాయణ, చాకలి వెంకటేశు, మాసులు చంద్రమోహన్, కాయల రమణయాదవ్, పుల్లయ్య, మసూద్‌వలి, శేఖర్‌యాదవ్, గుర్రం లక్ష్మీనారాయణ, జడేజా, ఎఎన్‌ఎం తిరుపాలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# బయో ఆధారిత మందులతో అధిక దిగుబడులు

**ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం**

రైతులు బయో ఆధారిత మందులు వాడి అధిక దిగుబడులు సాధించాలని శాస్త్రవేత్తలు సూచించారు. రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం, రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం తాడిపత్రి రూరల్ మండలం దిగువపల్లి గ్రామంలో రైతులకు మొక్కజొన్న, మిరప పంటల సాగుపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు రసాయనిక మందుల ద్వారానే కాకుండా జీవ సంబంధిత మందులు బవేరియా, వెర్టిసిలియం వంటి బయో ఆధారిత మందులను ఉపయోగించాలన్నారు. అలాగే మొక్కజొన్నలో లింగాకర్షణ బుట్టలు ఉపయోగించి కత్తెర పురుగు లార్వా, రెక్కల పురుగులను అదుపులో ఉంచాలని కోరారు. అలాగే మిరపలో కూడా నల్లతామర ఉధృతిని జిగురు అట్టలు, వేపనూనె, పురుగు మందులన్నింటినీ సమర్థవంతంగా సరైన సమయంలో ఉపయోగించి ఎదుర్కోవాలని తెలిపారు. అదేవిధంగా మొక్కజొన్న విత్తన 15 రోజుల నుంచి సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. 60 రోజుల వరకూ పంటను కాపాడగలిగితే ఆ తర్వాత ఇబ్బంది ఉండదని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కిషోర్, రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధి ప్రకాష్, ఆదర్శ రైతు సూర్యప్రకాశ్‌రెడ్డి, 45 మంది రైతులు పాల్గొన్నారు.

# ఎప్పటికప్పుడు పారిశుధ్య చర్యలు చేపట్టాలి : ఆర్‌డిఒ

ఆలయ అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో

**ప్రజాశక్తి-ఆత్మకూరు**

మండల పరిధిలోని పంపనూరు గ్రామంలో వెలసిన సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో ఎప్పటికప్పుడు పారిశుధ్యం చర్యలు చేపట్టాలని ఆర్‌డిఒ కేశవనాయుడు సూచించారు. గురువారం పంపనూరు సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ భక్తులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున అందుకు తగ్గ ఏర్పాట్లు చేస్తూ ఉండాలన్నారు. ముఖ్యంగా భక్తులకు సౌకర్యాలు కల్పించాలన్నారు. శాంతిభద్రతలను పర్యవేక్షిస్తుండాలన్నారు. ముఖ్యంగా ఆరోగ్యపరంగా పారిశుధ్యపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి నాగరాజునాయుడు, తహశీల్దార్ లక్ష్మీనాయక్, ఎంపిడిఒ జి.లక్ష్మీనరసింహా, ఎస్ఐ లక్ష్మీనారాయణ, ఆలయ ఇఒ బి.బాబు, అర్చకులు సీతారామశాస్త్రి, పంచాయతీ కార్యదర్శి మహబూబ్‌బాషా, విఆర్‌ఒ సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ నవజాత శిశు సంరక్షణ దినోత్సవం

**ప్రజాశక్తి-అనంతపురం**

రాష్ట్రీయ బాలస్వస్థ ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా జిల్లా పర్యవేక్షణ అధికారి డాక్టర్ నారాయణస్వామి ఆధ్వర్యంలో గురువారం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి త్వరిత చికిత్స కేంద్రంలో ప్రపంచ నవజాత శిశుసంరక్షణ దినోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా కడప పుష్పగిరి కంటి ఆసుపత్రి సహకారంతో బరువు తక్కువగా పుట్టిన, నెలలు నిండక ముందే పుట్టిన పిల్లలు, గుండెలోపం, రక్తహీనత ఇతర వ్యాధులతో బాధపడుతున్న పిల్లలను సమీకరించి వారికి కంటి రెటీనా పరీక్షలు నిర్వహించారు. 27 మంది పిల్లలను పరీక్షించగా 11 మందికి సమస్య ఉన్నట్టు గుర్తించారు. వీరిని మరలా రెండు వారాల తర్వాత పరీక్షించి రెటీనా మెచ్యూరిటీ పొందకపోతే ఉచితంగా చికిత్స అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ సివిల్ జడ్జి శివప్రసాద్‌యాదవ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఇబి.దేవి, పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కెఎస్‌ఎస్ వెంకటేశ్వరరావు, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్, ఆర్‌ఎంఒ డాక్టర్ హేమలత, డాక్టర్ సంజీవప్ప, చిన్న పిల్లల వైద్య నిపుణురాలు డాక్టర్ శ్రీవిద్య, కంటి పరీక్ష నిపుణురాలు జ్ఞానప్రసన్న, మేనేజర్ రజిత, స్టాఫ్ నర్స్ దివ్య, మౌనిక, తదితరులు పాల్గొన్నారు.

# చదువుతోనే సమాజంలో ప్రత్యేక గుర్తింపు : డిఆర్‌డిఎ పీడీ

**ప్రజాశక్తి-నార్పల**

చదువుతోనే సమాజంలో ప్రతి ఒక్కరికీ ప్రత్యేక గుర్తింపు వస్తుందని డిఆర్‌డిఎ పీడీ ఈశ్వరయ్య తెలిపారు. ఎంపిడిఒ గంగావతి ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో ఉల్లాస్ శిక్షణ కార్యక్రమంపై ఐకెపి యానిమేటర్లు, మహిళా సంఘాల సభ్యులు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులు, సచివాలయ ఉద్యోగులు, వెలుగు యానిమేటర్లు నిత్యం గ్రామీణ ప్రాంత ప్రజలతో కలుస్తూ ఉండాలన్నారు. చదువు ప్రాధాన్యతను గ్రామీణ ప్రాంత ప్రజలకు వివరించి ప్రతి ఒక్కరూ చదుకునేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ గంగావతి, వయోజన విద్య శాఖ సూపర్‌వైజర్ ఉషారాణి, వెలుగు ఎపిఎం తిప్పమ్మ, సీసీలు రామకృష్ణ, పుల్లారెడ్డి, నాగరత్నమ్మ, రామచంద్ర, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సునలిని, మృణాళిని, యానిమేటర్లు, తులసి, యుగేశ్వరి, అదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# రీ-సర్వేపై అనుమానాలొద్దు

**తాడిపత్రి :** ప్రభుత్వ చేపట్టిన పట్టణ రీసర్వేపై ఎలాంటి అనుమాలు వద్దని మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు దాదాపు వందేళ్ల తర్వాత పట్టణ పరిధిలో రీసర్వే చేస్తున్నట్లు తెలిపారు. రీసర్వే వల్ల ఎన్నోఏళ్లుగా ఉన్న సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. పట్టణ ప్రజలు రీ-సర్వే ద్వారా కలిగే ఉపయోగాలను గుర్తించి పురపాలక సంఘం, సచివాలయ సిబ్బందికి సహకరించాలని కోరారు. సచివాలయ సిబ్బంది రోజూ 50 ఇళ్లకు సర్వే చేయనున్నట్లు తెలిపారు. మీ భూమిని మీ సమక్షంలోనే సర్వే చేసి ఖచ్చితమైన కొలతలు వేసి చుపించనున్నట్లు తెలిపారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే సర్వే బృందాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

# స.హ. చట్టాన్ని కాపాడాలి

**నార్పల :** రోజురోజుకూ నిర్వీర్యం అవుతున్న సమాచార హక్కు చట్టాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు కె.అల్తాఫ్ కోరారు. గురువారం జిల్లాకేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో జిల్లా రెవెన్యూ అధికారిని కిసి వినతిపత్రం అందజేశారు. ఇందుకు జిల్లా రెవెన్యూ అధికారి స్పందిస్తూ సహ చట్టాన్ని తప్పక కాపాడుదామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కె.సుబ్బరాయుడు, కోశాధికారి టివి.రెడ్డి, ప్రచార కార్యదర్శి కెఎల్‌ఎం.ప్రసాద్ పాల్గొన్నారు.

# రైఫిల్ షూటింగ్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థికి అభినందన

**అనంతపురం :** రైఫిల్ షూటింగ్‌లో అత్యంత ప్రతిభ కనబరిచిన కోర్ట్ రోడ్డులోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థి వి.తీక్షణ్‌సాయిని పలువురు అభినందించారు. తీక్షణ్‌సాయి రాజమండ్రిలో జరిగిన స్టేట్ లెవెల్ అండర్ 14 విభాగం రైఫిల్ షూటింగ్ పోటీల్లో తృతీయ బహుమతి సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా పాఠశాల ఎజిఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ రైఫిల్ షూటింగ్‌లో తమ పాఠశాలకు చెందిన తీక్షణ్‌సాయి అత్యంత ప్రతిభ కనబరిచి జాతీయ పోటీలకు ఎంపిక కావడం గమనార్హమన్నారు. జాతీయస్థాయిలో కూడా రాణించి జిల్లాకు ఖ్యాతి తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తబస్సుం, ఎఒ గోపాల్, డీన్లు అప్పలనాయుడు, సిరాజుద్దీన్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

తీక్షణ్‌సాయిని అభినందిస్తున్న సుబ్బారెడ్డి

# సదస్సులతో నూతన ఆవిష్కరణలు

## రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య

మాట్లాడుతున్న రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య

**ప్రజాశక్తి-అనంతపురం**

ఆధునిక కంప్యూటింగ్ సదస్సు వల్ల సాంకేతికతపై అవగాహన పెరిగి నూతన ఆవిష్కరణలకు ఎంతగానో ఉపయోగపడతాయని జెఎన్‌టియు రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య సూచించారు. నగరంలోని జెఎన్‌టియు విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్సు విభాగంలో సిఎస్‌ఇ విభాగం, ఐసీట్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించిన ఆధునిక కంప్యూటింగ్ సదస్సు గురువారం ముసిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి సదస్సుల వల్ల నూతన విద్యార్థులు, బోధనా సిబ్బందికి ఆవిష్కరణలపై మంచి అవగాహన ఏర్పడుతుందన్నారు. ఉపాధ్యాయులు తమకున్న పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకుని విద్యార్థులకు బోధించాలని తెలిపారు. నైపుణ్యాలను అభివృద్ధి చేసుకున్న వారందరూ ఉన్నత శిఖరాలను అధిరోహించారన్నారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి, కోఆర్డినేటర్ ఎపి.శివకుమార్, కో కోఆర్డినేటర్ ఆర్.రాజశేఖర్, సదస్సు పరిశోధకులు జి.ఉమామహేశ్వరరావు, ఎస్.రహ్మనుద్దీన్, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.వసుంధర, అధ్యాపకులు పాల్గొన్నారు.

# జెడ్.వీరారెడ్డి కాలనీలో సమస్యలు పరిష్కరిస్తాం



వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

**ప్రజాశక్తి-గుత్తి**

మున్సిపాలిటీ పరిధి లోని జెడ్.వీరారెడ్డి కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని మున్సిపల్ కమిషనర్ బి.జబ్బర్‌మియా హామీ ఇచ్చారు. డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమంలో భాగంగా జెడ్.వీరారెడ్డి కాలనీలో కమిషనర్ గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి వి.నిర్మల, నాయకులు కాలనీవాసులు సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. జెడ్.వీరారెడ్డి కాలనీకి ప్రధాన రహదారి లేదన్నారు. తాగునీటి ట్యాంకులు, విద్యుత్ దీపాలు, మురుగు కాలువలు ఏర్పాటు చేయాలన్నారు. అంగన్వాడీ కేంద్రాన్ని నిర్మించాలని కమిషనర్ కు చెప్పారు. దీంతో సమస్యలను పరిష్కరిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో శ్యామల, కాంతమ్మ, వెంకటలక్ష్మి, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

# సాంకేతిక సదస్సులో 'గేట్స్' విద్యార్థుల ప్రతిభ

**ప్రజాశక్తి-గుత్తి**

అనంతపురంలోని జెఎన్‌టియు విశ్వవిద్యాలయంలో నిర్వహించిన 2కె 24 అనే జాతీయ స్థాయి సాంకేతిక సదస్సులో గుత్తి గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. దేశవ్యాప్తంగా దాదాపు 30 ఇంజనీరింగ్ కళాశాలల నుంచి వేలాదిమంది విద్యార్థులు సదస్సుకు హాజరయ్యారు. గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల నుంచి ఈసీఈ చదువుతున్న విద్యార్థులు ప్రాజెక్ట్ ఎక్స్పో, పోస్టర్ ప్రజెంటేషన్, కోడ్ కాంపిటీషన్, సర్క్యూట్ హంట్, సాంకేతిక క్విజ్‌ల్లో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ ద్వితీయ పథకాలను కైవసం చేసుకున్నట్లు కళాశాల కరస్పాండెంట్ వీకే.పద్మావతమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమెతో పాటు ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ నమ్రత, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ ఆర్చేక్ ప్రవీణ్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఇంతియాజ్ భాష, అధ్యాపకులు ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించారు.

# సిపిఎం ప్రాంతీయ కార్యదర్శిగా రామాంజనేయులు

**రాప్తాడు :** రాప్తాడు, అనంతపురం రూరల్ మండల కమిటీల ప్రాంతీయ కార్యదర్శిగా మన్నీల రామాంజనేయులు నియమితులయ్యారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన మండల మహాసభ నిర్వహించారు. ఈ మహాసభకు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సావిత్రమ్మ, బాలరంగయ్య హాజరై ప్రాంతీయ కమిటీ ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ప్రాంతీయ కార్యదర్శిగా మన్నీల రామాంజనేయులు, 9 మందిని కమిటీ సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ కమిటీ సభ్యులు ఎం.పోతులయ్య, సిద్ధయ్య, మధు, పుష్పరాజు, మల్లేష్, రాయమ్మ, రాజు, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

# నేరాలు ఘోరాలు

## తిరుపతిలో రైలు కిందపడి వ్యక్తి మృతి

**కళ్యాణదుర్గం రూరల్ :** మండలంలోని బట్టువానిపల్లి గ్రామానికి చెందిన అంజి మూడు రోజుల క్రితం తిరుమల వెళ్లి దైవ దర్శనం అనంతరం కొండ దిగి తిరుపతి చేరుకున్నాడు. అక్కడ పిచ్చి పిచ్చిగా ప్రవర్తిస్తూ ఓ ఫ్లై ఓవర్ బ్రిడ్జి పైకి ఎక్కి కిందకు దూకుతానని బిగ్గరగా అరుస్తుండగా స్థానికులు గమనించి సమాచారం ఇవ్వడంతో తిరుపతి ఈస్ట్ పోలీసులు అక్కడికి చేరుకుని అంజిని స్టేషన్‌కు తీసుకెళ్లారు. అలాగే బట్టువానిపల్లి మాజీ సర్పంచికు సమాచారం ఇవ్వడంతో గ్రామస్తులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. ఆ లోపే పోలీసులు అంజిని వదిలేయడంతో అతడు వెళ్లి రైలు పట్టాలపై పడుకోవడంతో రైలు మీద వెళ్లడంతో మొండెం, తల తెగిపోయి మృతి చెందాడు. ఇదిచూసిన బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు. పోలీసులు అంజిని స్టేషన్‌లోనే ఉంచి ఉంటే తమ కుమారుడు బతికేవాడు అని, పోలీసుల నిర్లక్ష్యం వల్లే కుమారుడిని కోల్పోయామని విలపించారు.

## మోటార్ల దొంగ అరెస్టు

**బెలుగుప్ప :** తోటల్లో మోటార్లను దొంగతనం చేసే దొంగను అరెస్టు చేసినట్లు ఎస్ఐ శివ తెలిపారు. ఎస్ఐ తెలిసిన వివరాల మేరకు..మండల పరిధిలోని కాలువపల్లి గ్రామానికి చెందిన దూదేకుల అన్వర్‌బాషా జీడిపల్లి, కాలువపల్లి, హనుమరెడ్డిపల్లి గ్రామాల్లోని తోటల్లో సుమారు నాలుగు మోటార్లు, 230 మీటర్ల కేబుల్ వైరు, ఓ స్టార్టర్ బాక్స్‌ను దొంగిలించినట్లు నిందితుడు ఒప్పుకున్నట్లు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ రామదాసు, జమేదారు బాల నరసింహులు, పోలీస్‌సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# క్యాన్సర్ నివారణకు స్క్రీనింగ్ ముఖ్యం

## జాతీయ క్యాన్సర్ అవగాహన కార్యక్రమంలో డిఎంహెచ్ఓ ఇబి.దేవి

ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎంహెచ్ఓ ఇబి.దేవి

**ప్రజాశక్తి-అనంతపురం**

క్యాన్సర్ నివారణకు స్క్రీనింగ్ చాలా ముఖ్యమని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి ఇబి.దేవి సూచించారు. జాతీయ క్యాన్సర్ అవగాహన కార్యక్రమంలో గురువారం 'క్యాన్సర్‌పై విజయం-స్క్రీనింతో సాధ్యం' అనే నినాదంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం నుంచి తెలుగు తల్లి విగ్రహం, తిరిగి కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇబి దేవి మాట్లాడుతూ క్యాన్సర్లలో చాలా రకాలు ఉన్నాయన్నారు. వైద్యసిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి అవగాహన కల్పిస్తూ ప్రతి ఒక్కరికీ స్క్రీనింగ్ కార్యక్రమం నిర్వహించారు. తద్వారా అనుమానిత క్యాన్సర్ లక్షణాలు ఉన్న వారిని తదుపరి రెఫెరల్ విధానం ద్వారా ప్రాథమికంగా మెడికల్ ఆఫీసర్, సెకండరీ హెల్త్ సర్వీసెస్ వైద్యులు పరీక్షించి అవసరమైన వారిని తదుపరి వ్యాధి నిర్ధారణ, చికిత్సల కోసం ప్రివెంటివ్ ఆంకాలజీ యూనిట్ ప్రభుత్వ మెడికల్ కళాశాలకు పంపించి చికిత్సలు అందించనున్నట్లు తెలిపారు. కావున ప్రజలందరూ ఈనెల 14న ప్రభుత్వం లాంఛనంగా నిర్వహించే గృహ సందర్శనలో ప్రజలందరూ భాగస్వాములై క్యాన్సర్ వ్యాధి నిర్మూలనకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యక్రమం నిర్వహణ అధికారి డాక్టర్ జి.నారాయణస్వామి, సెకండరీ హెల్త్ సర్వీసెస్ పాల్ రవికుమార్, ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం నోడల్ ఆఫీసర్ సుజాత, ప్రివెంటివ్ అంకాలజీ మెడికల్ కళాశాల యూనిట్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ మధుసూదన్ నిహారిక, సుమన, కమ్యూనిటీ మెడిసిన్ పీజీ డాక్టర్లు సునీల్, శ్రీహర్ష, మోనిక, మనీషా, రోనాల్డో, గీతాంజలి, రేడియో డయాగ్నసిస్ ప్రశాంతి, ఇఎన్‌టి వైద్యులు హెచ్ఒడి రాజేష్, డిపిఎంఒ రవి, డిఎంఒ ఓబులు, డెమో త్యాగరాజ్, డిప్యూటీ హెచ్ఇఒ గంగాధర్, ఎన్‌సిడి స్టాఫ్ ప్రేమ్ బాబు అంజి, టొబాకో సోషల్ వర్కర్ శ్రీరాములు, కిషోర్, మౌనిక, డిఇఐసి మేనేజర్ డి.రజిత తదితరులు పాల్గొన్నారు.

అలాగే ఎస్‌కెయు కళాశాల కాలేజ్ ఆఫ్ ఫార్మాసూటికల్ సైన్సెస్ ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో గురువారం జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.సోమశేఖర్, ఎన్ఎస్ఎస్ పిఒ సత్యసౌమ్య, తదితరులు పాల్గొన్నారు.

అలాగే జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా గురువారం అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సివిల్ అసిస్టెంట్ సర్జన్ ఎన్.ఉన్నతి, కళాశాల ప్రిన్సిపాల్ రామమూర్తి, అకాడమిక్ డీన్ రాయుడు పెయ్యాల, ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్ ఛైర్మన్ మాధవి, జాతీయ సేవా పథకం అధికారి ఖలీల్‌బాషా, నవీన్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**గుమ్మగట్ట :** జాతీయ క్యాన్సర్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల వైద్యాధికారి డాక్టర్ రమేష్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈ ర్యాలీ డాక్టర్ బాలాజీనాయక్, డాక్టర్ సందేశ్, సిహెచ్ఓ మురళీధర్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌కెయులో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

గుమ్మగట్టలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది, విద్యార్థులు

డిఎంహెచ్ఓకు వినతిపత్రం అందజేస్తున్న 104 ఉద్యోగులు

## 104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని వినతి

**ప్రజాశక్తి-అనంతపురం**

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా 104 సిబ్బంది గురువారం జిల్లాకేంద్రంలోని కార్యాలయంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఇబి.దేవి, ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం నోడల్ ఆఫీసర్ డాక్టర్ సుజాతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా 104 ఉద్యోగులు మాట్లాడుతూ మూడు నెలలుగా వేతనాలు అందలేదని వాపోయారు. దీంతో కుటుంబ పోషణ కూడా భారమైందన్నారు. దీంతోపాటు అనేక సమస్యలు ఉన్నాయన్నారు. వాటిని వెంటనే పరిష్కరించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో 104 ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్రమణ్యం, కోశాధికారి కిషోర్, బాబు, సహాయ కార్యదర్శి సురేష్, డిఇఒలు మానస, శాంతి, భాను, షబానా, మహ్మద, మహబూబ్‌పీరా, నరహరి, ఓబులేసు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

**గుమ్మగట్ట :** ఇటీవల నీటి తొట్టెలో పడి మృతిచెందిన మండల పరిధిలోని భైరవానితిప్ప ప్రాజెక్టు గ్రామానికి చెందిన జోష్ణ వన్నూరప్ప కుమారుడు కృష్ణకిషోర్ కుంటుబాన్ని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు మనోధైర్యం నింపారు. కుటుంబానికి ప్రభుత్వం అన్నివిధాలా తోడుగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిన్నికిష్టప్ప, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు సంగన్న, గిరిమల్లెప్ప, తదితరులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

**ప్రజాశక్తి-గుత్తి**

యువత మత్తు పదార్థాల జోలికి వెళితే భవిష్యత్తు నాశనం అవుతుందని సిఐ బి.వెంకటేశ్వర్లు, ఎస్ఐ కె.సురేష్ బాబు సూచించారు. గురువారం పట్టణంలోని శ్రీసాయి డిగ్రీ కళాశాలలో మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలకు వ్యతిరేకంగా విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చెడు స్నేహాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రస్తుతం సెల్ ఫోన్ల వల్ల యువతీ, యువకులు మోసాలకు గురవుతున్నారని, వాటి వల్ల జాగ్రత్త వహించాలన్నారు. వాహనాలు నడిపేటప్పుడు రోడ్డు నిబంధనలను పాటించాలన్నారు. రోడ్డు నిబంధనలతో ప్రమాదాలు నియంత్రించవచ్చు అన్నారు. విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీసాయి డిగ్రీ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ రంగస్వామిరెడ్డి, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

**పామిడి :** యువత, నిరుద్యోగులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ యుగంధర్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో యాంటీ డ్రగ్స్, యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలామంది యువత సరదాగా మొదలుపెట్టిన వ్యసనాలు జీవితాలను అంధకారం చేస్తాయన్నారు. యువత సమాజ, దేశ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిఐ యుగంధర్

## నాగులగుడ్డం తండాలో రక్త పరీక్షలు

రక్తహీనతపై అవగాహన కల్పిస్తు వైద్యసిబ్బంది

**శింగనమల :** కలెక్టర్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని నాగులగుడ్డం తండాలో గురువారం సికిల్ సెల్ అనీమియా (జన్యుపరమైన రక్తహీనత) రక్త పరీక్షలు నిర్వహించినట్లు పిహెచ్‌సి డాక్టర్ శంకర్‌నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన గ్రామీణ ప్రాంతమైన నాగలగుడ్డం తండాలో దాదాపు 50 మందికి రక్త పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెస్ట్ నరసాపురం సచివాలయ ఆరోగ్య కార్యకర్తలు రమణ, గీత, రామాంజనమ్మ, హెల్త్ ప్రొవైడర్ వరలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

**బుక్కరాయసముద్రం :** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న ఎపి ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో డాక్టర్ స్వాతిలక్ష్మి ఆధ్వర్యంలో సికిల్ సెల్ అనీమియా (జన్యుపరమైన రక్తహీనత) రక్త పరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా దాదాపు 186 మందికి రక్త పరీక్షలు నిర్వహించి యాప్‌లో అప్‌లోడ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దాసరి సునీత, ఎంపిడిఒ సొలమాన్‌రాజ్, ప్రిన్సిపాల్ హీరానాయక్, సిహెచ్ఓ మోహన్‌రావు, పీహెచ్ఎన్‌లు వెంకటలక్ష్మమ్మ, చెన్నమ్మ, టెన్త్ ఎడ్యుకేటర్ ఫాతిమా, సూపర్‌వైజర్లు సత్యనారాయణశాస్త్రి, జానీరాజ్, హెల్త్ అసిస్టెంట్లు ధనుంజయ, ఆనంద్, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు జయంతి, జ్యోతి, యామిని, మంజు, భార్గవి, మహిళా ఆరోగ్య కార్యకర్తలు ఆదినారాయణమ్మ, రుషింగమ్మ, పుష్పలత, వెంకటరమణమ్మ, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

**ఉరవకొండ :** ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని ఎంపిడిఒ బివి.రవిప్రసాద్ సూచించారు. గురువారం పట్టణంలోని 4, 5 సచివాలయాల సిబ్బంది ఆధ్వర్యంలో ఎపి ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో వైద్య, ఆరోగ్య సిబ్బంది 456 చిన్నారులకు సికిల్ సెల్ అనీమియా (జన్యుపరమైన రక్తహీనత) రక్త పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ డివిజన్ మలేరియా సబ్య యూనిట్ అధికారి భక్తుల కోదండరామిరెడ్డి, ఉపాధి హామీ పథకం ఎపిఒ విమల, హాస్టల్ వార్డెన్, తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకోర్టులు ఏర్పాటు

**ఉరవకొండ :** ఉరవకొండ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో క్రీడాకోర్టులు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపిడిఒ రవిప్రసాద్ తెలిపారు. ఎన్ఆర్ఇజిఎస్ పథకం కింద మంజూరైన వివిధ రకాల పనులను స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ విమల, మలేరియా సబ్ యూనిట్ అధికారి కోదండ రామిరెడ్డి, టిడిపి మండల ప్రెసిడెంట్ విజయభాస్కర్, టౌన్ ప్రెసిడెంట్ రామాంజనేయులు, కేశవానంద, రేగటి నాగరాజు, లాయర్ శ్రీనివాసులు, బోయ గోవిందు, మాజీ వైస్‌ఎంపిపి రాజేష్, వార్డు మెంబర్ రామాంజనేయులు, మీనగ.రవి, స్కూల్ కమిటీ ఛైర్మన్ మినుగ.రవి, చంద్ర, టిఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు భరత్‌చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

# తాటాకు చప్పుళ్లకు భయపడం

## సోషల్ మీడియా కార్యకర్తలకు అండగా ఉంటాం

## వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి

విలేకరులతో మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత

**ప్రజాశక్తి-అనంతపురం**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేసే తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి హెచ్చరించారు. గురువారం జిల్లాకేంద్రంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అసమర్థపాలనను ప్రశ్నిస్తున్న వైసిపి సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు, వేధింపులకు పాల్పడుతూ అరాచకాంధ్రప్రదేశ్‌గా మార్చారని మండిపడ్డారు. ప్రభుత్వ అసమర్థతను ప్రశ్నిస్తుంటే వైసిపి సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతూ థర్డ్ డిగ్రీ ఉపయోగిస్తున్నారని తెలిపారు. ప్రతిపక్షంలో ఉండగా చంద్రబాబు, పవన్‌కళ్యాన్ మాట్లాడిన వీడియోలతో సోషల్ మీడియా ద్వారా ప్రశ్నిస్తుంటే గొంతునొక్కుతున్నారని విమర్శించారు. చివరకు ఏ పోలీస్‌స్టేషన్‌లో ఉంచారో కూడా తెలియజేయడం లేదన్నారు. ఇటీవల అనంతపురం పర్యటన సందర్భంగా డిజిపి తిరుమలరావు రాజ్యాంగబద్ధంగా నడుచుకుంటామని వ్యాఖ్యానించారని గుర్తు చేశారు. కానీ వాస్తవ పరిస్థితి మరోలా ఉందన్నారు. ఐఎఎస్, ఐపిఎస్‌లు మాట వినకుంటే సస్పెండ్ చేయడమో, బదిలీ చేయడమో చేస్తున్నారని తెలిపారు. ముమ్మాటికీ ఐపిఎస్‌లు, ఐఎఎస్‌లను బ్లాక్‌మెయిల్ చేయడమేనన్నారు. ఎన్నికలకు ముందు కరెంట్ ఛార్జీలను పెంచేది లేదని, అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే రూ.17వేల కోట్ల భారం వేస్తున్నారు. ఎక్కడికక్కడ టిడిపి నాయకులు ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. మద్యం ఏరులై పారిస్తున్నారు. వీటన్నింటినీ సోషల్ మీడియా ద్వారా ప్రశ్నిస్తుంటే పోలీసులు అరెస్టులు చేయడం బాధాకరమన్నారు. ఐఎఎస్‌లు, ఐపీఎస్‌లు తాము చెప్పినట్లు నడుచుకోవడం లేదని కేబినెట్ సమావేశంలో చర్చించడం సిగ్గుచేటన్నారు. ఇకపోతే జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో నాయకులు పార్టీ శ్రేణులకు తోడుగా నిలవాలని పిలుపునిచ్చారు. అవసరమైతే పోలీస్‌స్టేషన్లకు వెళ్లి అక్రమ కేసులపై ప్రశ్నించాలన్నారు. అనంతపురం జిల్లా బెళుగుప్ప మండలం నక్కలపల్లిలో వైసీపీ కార్యకర్త సంజీవరెడ్డిని బుధవారం అరెస్టు చేశారని, ఆరా తీస్తే పుట్టపర్తి పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసిందన్నారు. అక్కడి డీఎస్పీతో తాను మాట్లాడితే తమ వద్ద లేదని అంటున్నారన్నారు. రాష్ట్ర డీజీపీ, సీఎస్‌లకు పరిపాలనలో అనుభవం ఉందని, మీరు రాజ్యాంగబద్ధంగా వ్యవహరించకపోతే చరిత్రహీనులుగా మిగిలిపోతారనిన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం కాకుండా అంబేద్కర్ రాజ్యాంగాన్ని అమలు చేయాలని సూచించారు. అధికారులు మాత్రమే శాశ్వతమని, రాజకీయ నాయకులు కాదన్నారు. అధికార పార్టీకి తొత్తులుగా మారొద్దని తెలిపారు. ఏ వైసిపి నాయకుడు, కార్యకర్త కూడా అధైర్యపడొద్దని అధినేత జగన్ తమకు అండగా ఉంటారని స్పష్టం చేశారు.

భూమిపూజ చేస్తున్న కార్యనిర్వాహణాధికారి రమేష్

## విద్యుత్ స్తంభం ఏర్పాటుకు భూమిపూజ

**ఉరవకొండ :** మండల పరిధిలోని పెన్నఅహోబిలంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో అనంతపురం నుంచి ఉరవకొండకు వెళ్లే రహదారి సర్కిల్‌లో ఐమాక్స్ లైట్‌పోల్ నిర్మానానికి ఆలయ కార్యనిర్వహణాధికారి రమేష్ గురువారం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు,స్థానికులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## 10మంది బైండోవర్

**గుమ్మగట్ట :** ముందస్తు చర్యల్లో బాగంగా మండలవ్యాప్తంగా 10మందిని గురువారం బైండోవర్ చేసినట్లు ఎస్ఐ ఈశ్వరయ్య తెలిపారు. ఈ సందర్భంగా పదిమందినీ తహశీల్దార్ శ్రీనివాస్ ఎదుట హాజరు పరిచి బైండోవర్ చేసినట్లు తెలిపారు.

## కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేయాలి : ఎఐఎస్ఎఫ్

**ప్రజాశక్తి-కళ్యాణదుర్గం**

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని తక్షణమే అమలు చేయాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హనుమంతరాయడు, కుళ్లాయిస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో విద్యార్థులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ గురువారం ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పట్టణంలో వందలాది మంది విద్యార్థులతో కలిఇ ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం ఆర్డీవోకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లా డుతూ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం లేక విద్యార్థులు అన్న క్యాంటీన్లను ఆశ్రయిస్తున్నారన్నారు. కావున వెంటనే జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని, లేనిచో రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలకు శ్రీకారం చుడతామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ధర్నాలో ఎఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి ఆంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షులు నరసింహ యాదవ్, మంజునాథ్, జిల్లా సహాయ కార్యదర్శులు వెంకట్‌నాయక్, చందు, జిల్లా కార్యవర్గ సభ్యులు రాజేష్, నియోజకవర్గ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిద్ధు, నవీన్, నాయకులు పవన్, హరికృష్ణ, మౌని, అనిల్, వర్ధన్, స్రవంతి, మౌళి, అమ్ము, శ్రావణి, తదితరులు పాల్గొన్నారు

## మున్సిపల్ కార్మికులకు సామగ్రి పంపిణీ

**ప్రజాశక్తి-రాయదుర్గం**

పురపాలక సంఘంలో పనిచేస్తున్న రెగ్యులర్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులకు గురువారం మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాలు శిల్ప, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా హాజరై కార్మికులకు దుస్తులు, గ్లౌజులు, సబ్బులు, నూనె, తదితర సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శారద, పద్మజ, కోఆప్షన్ మెంబర్ నజీర్, మాజీ వైస్ చైర్మన్ మహబూబ్‌బాషా, మాజీ సభ్యులు హనుమంతు, వైసిపి నాయకులు బషీర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్రయాదవ్, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సామగ్రిని అందిస్తున్న కమిషనర్

# భూసమస్యల పరిష్కారానికి చర్యలు

## కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

భూసమస్యలు పరిష్కరించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటామని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ తెలియజేశారు. అనంతపురం నగరంలోని ఆల్‌ఇండియా రేడియో స్టేషన్‌లో గురువారం ఉదయం ఆకాశవాణి అనంత మిత్ర ఫోన్ ఇన్ కార్యక్రమంలో పాల్గొని జిల్లాలో భూ సమస్యలపై జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మతో కలిసి నేరుగా ప్రజలకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ చుక్కల భూమికి చుక్కలు తొలగించి పట్టాదారు పేరు మీద ఎక్కించడం ఒక సేవ అని, అక్కడ దరఖాస్తు చేసుకోవాలన్నారు. తహశీల్దార్, ఆర్డీవో, జాయింట్ కలెక్టర్ పరిశీలన అనంతరం కలెక్టర్‌కి వస్తుందన్నారు. ఈ సేవ కోసం సచివాలయం, మీ సేవలో దరఖాస్తు చేయాలన్నారు. కొత్త భూములు ఏది రిజిస్ట్రేషన్ చేయకూడదని పైనుంచి

ఫోన్ ఇన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ఆదేశాలు ఉన్నాయన్నారు. త్వరలో ఆ ప్రక్రియ పూర్తవుతుందన్నారు. వెబ్ ల్యాండ్ ఆన్లైన్ పోర్టల్‌లో భూమి గురించి అన్ని వివరాలు ఉంటాయని, అందులో పకడ్బందీగా మార్పు చేర్పులు చేయడానికి వీలులేదన్నారు. భూమి, ఇతర సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలు చేపడతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ ఏ.మలోల, ఆల్ ఇండియా రేడియో స్టేషన్ డైరెక్టర్ నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

వినతిపత్రం అందిస్తున్న రంగరాయల సేవా సమితి సభ్యులు

## శింగనమల చెరువులో బోటింగ్ ఏర్పాటు చేయాలని వినతి

**శింగనమల :** మండల కేంద్రంలోని రంగరాయల చెరువులో విహారయాత్ర బోటింగ్ ఏర్పాటు చేయాలని శ్రీ రంగరాయల సేవాసమితి సభ్యులు జక్కల రామ్‌చరణ్ యాదవ్ కోరారు. ఈమేరకు గురువారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శింగనమల చెరువు జాతీయ రహదారికి ఆనుకుని ఉన్నందున మరువకొమ్మ వద్ద చక్రాయపేట పంచాయతీలోని శివపురం గ్రామ పొలం సర్వేనెంబర్ 96లో ప్రభుత్వ స్థలం ఉందన్నారు. ఆ భూమిలో ఉద్యానవనం ఏర్పాటు చేస్తే పర్యాటకులు ఎక్కువగా సందర్శించే అవకాశం ఉందన్నారు. కావున ప్రభుత్వం స్పందించి ఉద్యానవనం ఏర్పాటు చేయడంతోపాటు చెరువులో విహారయాత్రం బోటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు.

## సివి రామన్, బిపిన్ చంద్రపాల్‌కు నివాళి

**ప్రజాశక్తి-గుత్తి**

నోబెల్ బహుమతి గ్రహీత సివి.రామన్, స్వాతంత్ర్య సమరయోధుడు బిపిన్ చంద్రపాల్ జయంతిని పురస్కరించుకుని గురువారం గుత్తిలోని క్రీడా మైదానం వద్ద ఉన్న పెన్షనర్ల భవనంలో చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎపి రాష్ట్ర పెన్షనర్ల సంఘం తాలూకా ఉపాధ్యక్షురాలు స్వర్ణాంబ, అదనపు కార్యదర్శి జెన్నే కుళ్లాయిబాబు, కార్యదర్శి కె.రామ్మోహన్, సంయుక్త కార్యదర్శి లక్ష్మీనారాయణ రెడ్డి, నాయకులు వెంకటేష్, విజయలక్ష్మి, నారాయణరెడ్డి, శామ్యూల్, స్వామిదాస్ షేక్షావలి, నారాయణ శెట్టి, చెన్నారెడ్డి, గోవిందప్ప, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

నివాళులు అర్పిస్తున్న పెన్షనర్ల సంఘం నాయకులు

## శిక్షణ పేరుతో ఉపాధ్యాయులను శిక్షించడం తగదు

**ప్రజాశక్తి-అనంతపురం**

వివిధ రకాల శిక్షణ పేరుతో బోధనకు దూరం చేస్తూ ఉపాధ్యాయులను శిక్షించడం తగదని ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు ఎన్.రమణారెడ్డి, జిల్లా ప్రధన కార్యదర్శి ఎస్.రామాంజనేయులు డిమాండ్ చేశారు. గురువారం బ్రహ్మసముద్రం మండలంలోని పిల్లలపల్లి, వేపులపర్తి, నాగిరెడ్డిపల్లి, గొంచిరెడ్డిపల్లి, భైరసముద్రము, గోవిందయ్యదొడ్డి, ఎర్ర కొండాపురం పాఠశాలల్లో ఎస్‌టియు సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయులను బోధనకు దూరం చేస్తూ అనేక రకాలైన యాప్‌ల ద్వారా బోధనేతర పనులు అప్పగించడం బాధాకరమన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ఆయా యాప్‌లను రద్దు చేసి కేవలం బోధనకు మాత్రమే ఉపాధ్యాయులను ఉపయోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు సీనియర్ నాయకులు ఎం.ఆనందరెడ్డి, వై.చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత శిక్షణ

**పామిడి :** జర్దోసి మగ్గంవర్క్, కంప్యూటర్ ట్యాలీలో జిల్లాకేంద్రంలోని రూడ్‌సెట్ సంస్థలో ఈనెల 13 నుంచి 30 రోజులపాటు యువకులకు శిక్షణ ఇవ్వనున్నట్లు డైరెక్టర్ విజయలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణకు ఉమ్మడి అనంతపురం జిల్లా గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారై ఉండి ఆధార్, రేషన్ కార్డులు కలిగి ఉంటే అర్హులన్నారు. శిక్షణ కాలంలో భోజనం, వసతి ఉచితంగా కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు సెల్..96188 76060, 83099 15577 సంప్రదించాలని కోరారు.

## ఆసుపత్రికి సర్జికల్ సామగ్రి అందజేత

**పామిడి :** మండలంలోని సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో గురువారం ప్రభుత్వ ఆసుపత్రికి 200 విలువైన సర్జికల్ సామగ్రిని వైద్యాధికారి డాక్టర్ శివకార్తీక్‌రెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవాసమితి అధ్యక్షుడు విశ్వనాథ్, అనంతపురం ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నారాయణమూర్తి, వాసవీ మాతృమండలి అధ్యక్షురాలు రాజేశ్వరి, సమితి సభ్యులు, డాక్టర్లు నాగేంద్ర, కుమార్, ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# స్వయం సహాయక సంఘాలతో సమావేశం

సమావేశంలో మాట్లాడుతున్న కోఆర్డినేటర్ హర్షద్ అహ్మద్

**ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్**

స్వయం సహాయక సంఘాల సభ్యులు ప్రొఫైలింగ్ యాప్‌ను ఆన్‌లైన్ అప్‌డేట్ చేసుకోవాలని టౌన్ మిషన్ కోఆర్డినేటర్(టిఎంసి) హర్షద్‌అహ్మద్ సూచించారు. పట్టణంలోని ప్రజావేదిక(కళ్యాణదుర్గం ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యాలయం)లో గురువా రం స్వయం సహాయక సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన హర్షద్‌అహ్మద్ మెప్మా-ఎస్‌హెచ్‌జి యాప్ ఆన్‌లైన్ అప్‌డేట్ గురించి వివరించారు. ప్రొఫైల్ యాప్‌ను అప్‌డేట్ చేసుకోవడం ద్వారా సంఘం సభ్యుల వాస్తవిక సమాచారం ఆన్‌లైన్‌లో పొందుపరిచి ఉంటుందన్నారు. ఎలాంటి అవకతవకలు, అవినీతి, డూప్లికేషన్, డబుల్ ఎంట్రీలకు అవకాశం ఉండదన్నారు. కావున ఈ నెల 8వ తేదీ నుంచి ప్రతి సంఘం సభ్యుల కచ్చితంగా అప్‌డేట్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్లు సంధ్యారాణి, రామ్మోహన్, రీసోర్స్‌పర్సన్స్, సంఘాల లీడర్లు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## జనన, మరణ ధ్రువీకరణ పత్రాలకు డబ్బులు ఇవ్వొద్దు : కమిషనర్

**ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్**

జనన, మరణ ధ్రువీకరణ పత్రాలకు ప్రజలు ఎవరికీ డబ్బులు ఇవ్వొద్దని మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ సూచించారు. జనన, మరణ ధ్రువీకరణ పత్రాల కోసం పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేంద్రంలో కొందరు సిబ్బంది డబ్బు వసూలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుకి తెలియడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు కమిషనర్ యుద్ధ ప్రాతిపదికన సచివాలయం సిబ్బందితో మున్సిపాలిటీ కార్యలయంలో 4 కౌంటర్లు ఏర్పాటు చేయించారు. కమిషనర్ మాట్లాడుతూ ఆఫీస్ రుసుము మాత్రమే చెల్లించి వెళ్తే మరుసటి రోజు మా సిబ్బంది మీకు ఫోన్ చేసి సర్టిఫికెట్ మంజూరు చేస్తారని, ఎవరికీ ఒక రూపాయి కూడా ఇవ్వవద్దని తెలిపారు. ఎవరైనా డబ్బు అడిగితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

## వికలాంగుని ఇల్లు కబ్జాపై ఆర్డీవోకు ఫిర్యాదు

**ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్**

కణేకల్లు మండలంలోని బిదురుకొంతం గ్రామానికి చెందిన వికలాంగుడు(బుద్ధిమాంద్యం) జి.శివకుమార్‌కు సంబంధించిన ఇంటిని ఓ వ్యక్తి దౌర్జన్యంగా కబ్జా చేశారని జిల్లా, పట్టణ వికలాంగుల సంఘం అధ్యక్షులు, నాయకులు గురువారం ఆర్డీవో వసంత్‌బాబుకి ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆర్డీవో ఈ సమస్యను పరిశీలించి త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు వసంత్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు కె.ఉద్దీప్‌సింహా, దివ్యాంగ పోరాట హక్కుల సమితి సభ్యుడు మల్లాపురం దొనస్వామి, కణేకల్లు మండల వికలాంగుల పోరాట సమితి సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.